క్లుప్తంగా

చురుగ్గా అభివృద్ధి పనులు



ప్రశాంతినగర్‌లో చేపడుతున్న రహదారి పనులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ప్రశాంతి నగర్‌లో సీసీ రోడ్లు, కాల్వల పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ నిధులు రూ.5.6 లక్షలతో ఈ పనులు చేపట్టారు. సీసీ డ్రైన్ పనులు పూర్తి అయిన తర్వాత శుక్రవారం రోడ్డు పనులు మొదలు పెట్టారు.

అనాథ వృద్ధులకు జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



వృద్ధులను ఆశ్రమానికి తీసుకొచ్చిన మమత

విశాఖ విద్య: అనాథ వృద్ధులకు ఎన్‌ఏడీ కూడలిలోని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఇద్దరి వృద్ధులను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చిన బంధువులు, తిరిగి వారిని తీసుకెళ్లేందుకు ఆస్పత్రికి రాలేదు. దీంతో విషయాన్ని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతకు ఆస్పత్రి నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. మమత శుక్రవారం కేజీహెచ్‌కు వెళ్లి ఆ ఇద్దరి వృద్ధులను ఆశ్రమానికి తీసుకొచ్చారు. వారికి తగిన సౌకర్యాలు కల్పించి భోజనం ఏర్పాటు చేశారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: సామాజిక భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నిర్మాణంలో నాణ్యత లోపిస్తే క్షమించేది లేదని 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య హెచ్చరించారు. వార్డు పరిధి ఉప్పరకాలనీ వద్ద జీవీఎంసీ నిధులతో చేపట్టిన సామాజిక భవన నిర్మాణ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పరకాలనీ వాసుల అభ్యర్థన మేర జీవీఎంసీ నిధులతో ఈ భవనం నిర్మిస్తున్నట్టు చెప్పారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో పాటు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ అధికారులు,పార్టీ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'నా మట్టి-నా దేశం'



మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52,90 వార్డుల్లో బీజేపీ ఎన్‌ఏడీ మండల అధ్యక్షుడు గొటివాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నామట్టి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన సమరయోధులు, అమర జవాన్లను స్మరించుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించి దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత్ వాటిక నిర్మాణంలో వినియోగించడం జరుగుతుందన్నారు. పశ్చిమ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ దాడి పురుషోత్త రమేష్, పార్టీ నాయకులు మంజుల, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా వినాయక చవితి

- పశ్చిమ సమన్వయకర్త ఆడారి పిలుపు
- విరివిగా మట్టి విగ్రహాల పంపిణీ



విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



గోపాలపట్నం బంక్ వద్ద మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: పర్యావరణ హితంగా వినాయక చవితి నిర్వహించాలన్న ఉద్దేశంతో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 91, 92వ వార్డుల్లో శుక్రవారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ సుమారు 2000 విగ్రహాలను అందించారు. అలాగే 91వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో 300, పాతగోపాలపట్నంలో 400, బాజీ జంక్షన్‌లో 300 విగ్రహాలు పంపిణీ చేశారు. 92వ వార్డు ప్రశాంతినగర్‌లో 300, గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద 300, వెంకటాపురంలో 400 వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతిమలతో పాటు వినాయక చవితి కథ విధానం పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మట్టి విగ్రహాల వల్ల పర్యావరణానికి ప్రమాదం ఉండదన్నారు. ప్రజలు ఈ పండగను పర్యావరణహితంగా భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 91, 92వ వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజించండి

మల్కాపురం: పర్యావరణ పరిరక్షణకు అంతా సహకరించాలని.. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమనే పూజించాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. తన క్యాంప్ కార్యాలయం శుక్రవారం పలు పాఠశాలల విద్యార్థులతో పాటు స్థానికులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిదిండి బద్రీనాథ్,ఎం. పెంటారావు,రేవళ్ల సత్యనారాయణ,అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న పిలక రామ్మోహనరెడ్డి

సింథియా: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. ఈ క్రమంలో మరో ముందడుగు వేస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వార్డులోని చింతల్లోవ సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని ఆస్పత్రులను ఆధునీకీకరించి, వైద్య సేవలను మెరుగుపరిచారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య సేవలను ప్రజల ముంగిటకే చేర్చారని కొనియాడారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది ఆరా తీస్తారని, తద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందిస్తారన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షులు కొట్నాన రవి, ఇతర నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



జీవీఎంసీ ఈఈ ప్రసన్నను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తారా ప్రసన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి వి.భార్గవి, వివిధ విభాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు ఆహ్వానం



మళ్ల విజయప్రసాద్‌ను సన్మానిస్తున్న యూత్ సభ్యులు

విశాఖ విద్య: వరసిద్ధి వినాయక నవరాత్రులు ఆనందంగా జరుపుకోవాలని పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. ఎన్‌ఏడీ బుచ్చిరాజుపాలెం శ్రీగౌరీ యూత్ సభ్యులు శుక్రవారం ఆయనను కలిసి వినాయక చవితి వేడుకలకు ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ ఆనందోత్సవాల నడుమ పండగ నిర్వహించుకోవాలన్నారు. వేడుకల్లో తప్పనిసరిగా పాల్గొంటానన్నారు. యూత్ సభ్యులు దొడ్డి కన్న, శరగడం అరుణ్ , దాడి ప్రసాద్, మరిసెట్టి శ్రీను, భీశెట్టి రావి, దొడ్డి జగన్, యల్లపు వెంకటేశ్వరరావు, దొడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బంక్ జంక్షన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను తొలగించి నూతన కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే బీఆర్‌టీఎస్ రహదారితో పాటు సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన కెమెరాలు పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టారు. ఇదే విధంగా పలు జంక్షన్లలో కెమెరాల నిర్వహణ చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు.

జాగ్రత్తలతో వ్యాధులు దూరం



సీజనల్ వ్యాధులు నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కాపురం: వాతావరణంలో మార్పుల కారణంగా పలు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, తగు జాగ్రత్తలు పాటిస్తే వాటికి దూరంగా ఉండొచ్చని 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య అన్నారు. 58వ వార్డు ఉప్పర కాలనీలో శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వలపై దోమలు చేరి గుడ్లు పెట్టి వాటి సంతతని పెంచుకుని తద్వారా రోగాల బారిన పడేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే-డ్రైడే పాటించి ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, వ్యర్థాలు లేకుండా చూడాలని సూచించారు. జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ వర్షాభావం అధికంగా ఉండటం వల్ల మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తమ చుట్టుపక్కల పరసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. టెక్నో సాఫ్ట్ సొల్యూషన్స్, వోల్టా ఫ్యాషన్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మ్, శ్రీరామ్ ఫైనాన్స్, రిలయన్స్ జియో, వరుణ్ మోటర్స్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, రెడ్డీస్ లేబరేటరీస్, బిగ్‌బాస్కెట్, సెవెన్‌హిల్స్ హెల్త్ కేర్ మొదలగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 873 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 241 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 104 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి, వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిలో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

శిశుగృహాను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



శిశుగృహలో దస్త్రాలు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ దరి శ్రీరాంనగర్‌లోని శిశుగృహను శుక్రవారం సాయంత్రం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. శిశుగృహ సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఆమె దస్త్రాలతో పాటు భవన పరిసరాలను పరిశీలించారు. శేషమ్మ వెంట శిశుగృహ సంరక్షణ అధికారి మమతా, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



సంతోష్‌నగర్‌లో బాబ్ కాట్‌తో పిచ్చి మొక్కలు తొలగింపును పరిశీలిస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోష్‌నగర్‌లో రహదారుల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ పనులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు స్థానికులు ఇక్కడి సమస్యను విన్నవించారు. పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండడం వల్ల పాములు, విషపురుగులు సంచారం ఎక్కువగా ఉందని వాపోయారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారుల ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం వేణుగోపాల్

గోపాలపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా మొదలయ్యాయి. ఈ కార్యక్రమాన్ని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్ ప్రారంభించారు. వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గోపాలపట్నం పీఈటీ సత్యకళ మాట్లాడుతూ మండల పరిధిలోని 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 ఏళ్ల వయసు గల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. తొలి రోజు బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్‌తోపాటు అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి జట్లుగా తయారు చేసి నియోజకవర్గ స్థాయికి పంపిస్తామని తెలిపారు. వాలీబాల్‌లో గోపాలపట్నం హైస్కూల్, కబడ్డీలో మాధవధార, ఖోఖోలో కొత్తపాలెం హైస్కూల్, యోగాలో-కె.కాలనీ హైస్కూల్, షటిల్‌లో గోపాలపట్నం హైస్కూల్, అథ్లెటిక్స్‌లో జీవీఎంసీ కప్పరాడ, హెచ్‌బీ వెంకటాపురం హైస్కూల్, త్రోబాల్‌లో యల్లపువానిపాలెం హైస్కూల్, బ్యాడ్మింటన్‌లో గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పోటీలను ఆయా స్కూళ్ల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

'సెయింట్ జోసెఫ్'లో స్కాలర్‌షిప్ టెస్ట్ రేపు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 17వ తేదీన నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు ఇంటర్ బైపీసీ పాసైన విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా కళాశాల ఫీజులో 100 శాతం రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు 92473-62689లో సంప్రదించాలని కోరారు.

నమ్మి వస్తే.. వదిలేసి పోయాడు..!

హైదరాబాద్ యువతికి ఆశ్రయం



ఆశ్రమం వద్దకు రూపను తీసుకొచ్చిన నిర్వాహకులు(మధ్యలో ఉన్న యువతి)

విశాఖ విద్య: చిన్నతనంలోనే అమ్మానాన్నను కోల్పోయి ఆశ్రమంలో పెరిగింది. నమ్మిన వ్యక్తి కూడా మోసం చేయడంతో మళ్లీ అనాథ అయింది. వెంట తీసుకొచ్చిన డబ్బులు, సెల్‌ఫోన్ ఇతర వస్తువులన్నీ తీసుకుపోవడంతో దిక్కుతోచని స్థితిలో శుక్రవారం విశాఖ బీచ్‌రోడ్‌లో తిరుగుతున్న ఆ యువతిని 3వ పట్టణ పోలీసులు గుర్తించి, రెడ్ క్రాస్ ప్రతినిధుల సహకారంతో ఎన్‌ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ వసతి గృహానికి తరలించారు. వసతి గృహం మేనేజర్ ఎల్లేటి పద్మ, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం హైదరాబాద్‌కు చెందిన రూప చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ అక్కడే పనులు చేసుకునేది. ఆశ్రమం దగ్గరలో ఓ వ్యక్తిని నమ్మి జీతం డబ్బులతో విశాఖ పట్నం వచ్చింది. విశాఖకు వచ్చిన తర్వాత రూప తీసుకొచ్చిన వ్యక్తి డబ్బులు, ఇతర వస్తువులన్నీ తీసుకొని బీచ్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. నిస్సహాయ స్థితిలో బీచ్‌రోడ్‌లో తిరుగుతున్న ఆమెను చూసిన త్రీ టౌన్ పోలీసులు వివరాలు సేకరించారు. ఎన్‌ఏడీ బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ వసతి గృహానికి తరలించారు. వసతి గృహం మేనేజర్ ఎల్లేటి పద్మ ఆమె పరిస్థితిని స్వయం కృషి వెల్ఫేర్ సొసైటీ వారి దృష్టికి తీసుకెళ్లింది. సొసైటీ నిర్వాహకులు ఉగ్గిన శ్రీనివాసరావు వసతి గృహానికి వచ్చి రూపకు తమ సంస్థలో ఉపాధి కల్పించేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సు శిక్షణ ఇప్పించేలా తగిన ఏర్పాట్లు చేశారు.

8 వాహనాలపై కేసుల నమోదు



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: అధిక లోడుతో వెళ్తున్న ఎనిమిది రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టినట్లు ఉప రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు జె.రామ్‌కుమార్, ఐ.వేణుగోపాలరావు, ఎం.బుచ్చిరాజు, కె.ప్రవీణ్ కుమార్, బి.బాలాజీరావు, మన్మోహన్, కె.శ్రీనివాస్, ఆర్.సుధీర్, బి.రాజారావు, గణేష్ రెడ్డి, హరిప్రసాద్, ఏఎంవీఐలు శిరీష, దేవి, లలిత, సృజన పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు..	
జోన్-1 (సీతమ్మధార నుంచి హనుమంతవాక)	9440812488
జోన్-2 (కంచరపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్)	9440812489
జోన్-3 (మధురవాడ-భీమిలి-హనుమంతవాక)	9490606924

ఫైర్ అనుమతుల కోసం..	
ఆర్ఎఫ్‌వో	9989961135
డీఎఫ్‌వో	9912448555
ఎస్ఎఫ్‌వో	7989495108

దొండపర్తి : వినాయక చవితి సందర్భంగా నగరంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ శాఖ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఏపీఈపీడీసీఎల్, రవాణా, ఏపీ ఫిషరీస్, మెరైన్ పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల్లో బారికేడింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అలాగే జీవీఎంసీ, ఫిషరీస్ ద్వారా తగినంత మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి వారికి సరపడా లైఫ్ జాకెట్లు అందించాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా పాయింట్ల వద్ద హైడ్రాలిక్ హై ఎండ్ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల ద్వారా కరపత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. ఆస్పత్రి, పాఠశాలలు, మతపరమైన ప్రదేశాల్లో లౌడ్‌స్పీకర్లు వాడకంపై పరిమితులు ఉంటాయని, గణేష్ మండపాల వద్ద మ్యూజిక్ 10 డెసిబుల్స్‌కు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. నిమజ్జన ప్రదేశాల్లో అగ్నిమాపకదళం/రెస్క్యూ మేనేజ్‌మెంట్ చర్యలు సమర్థవంతంగా చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముఖ్యమైన గణేష్ మండపాల వద్ద మొబైల్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను, బకెట్ ఇసుక, నీటిని అందుబాటులో ఉంచేందుకు నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాగర్‌నగర్, అప్పికొండ, ఇతర నిమజ్జన ప్రదేశాల్లో సంబంధిత ఎస్‌హెచ్‌వోలను సంప్రదించి ఆర్టీసీ బస్సుల మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలని, ఆ సర్టిఫికెట్ నిమజ్జనానికి వినియోగించే ప్రతి వాహనంలో ఉండాలన్నారు.

మండపాలకు అనుమతులు ..

మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా వెంకటేశ్వర థియేటర్ పక్కన ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం 4వ అంతస్తులో ఉండే రీజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్థానిక ఈపీడీసీఎల్ ఏఈ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఆ ఎన్‌వోసీతో సంబంధిత పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను సంప్రదిస్తే అనుమతి ఇవ్వనున్నారు.